సాక్షి తిరుపతి
శుక్రవారం । 12 । జూలై । 2024



బియ్యం లారీల సీజ్

బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్న రెండు లారీలను రెవెన్యూ, పోలీస్‌శాఖ అధికారులు సీజ్ చేశారు. - 8లో



రాత్రిపూట గస్తీలు తప్పనిసరి

రాత్రిపూట గస్తీలు తప్పనిసరి అని తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సిబ్బందిని ఆదేశించారు. - 8లో



దూసుకొచ్చిన మృత్యువు

మృత్యువు దూసుకొచ్చింది. వలస కార్మికుల బతుకులను ఛిద్రం చేసింది. ముగ్గురి ప్రాణాలను గాల్లో కలిపేసింది. - 8లో

న్యూస్‌రీల్

దాడుల సంస్కృతి మంచిది కాదు



పేచీరాజ్‌ను పరామర్శిస్తున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి, నెమళ్లపూడి సురేష్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం): ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, ఇలాంటి సమయాల్లో దాడుల సంస్కృతి మంచిది కాదని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి హితవు పలికారు. టీడీపీ నేతల దాడిలో తీవ్రంగా గాయపడి తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నేత పేచీరాజ్‌ను ఆయన గురుమూర్తి గురువారం పరామర్శించారు. నేనున్నానని ధైర్యం చెప్పారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఇటువంటి దాడులను ఎవరూ ప్రోత్సహించరాదన్నారు. కొత్త ప్రభుత్వం నెల రోజులు గడుస్తున్నా అభివృద్ధి, ప్రజా సమస్యలపై దృష్టి సారించకపోగా.. ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై కక్షపూరిత దాడులు చేయడం నీచమైన సంస్కృతికి నిదర్శనమన్నారు. ఈ దాడికి సంబంధించి పాదర్శకంగా విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని వెంకటగిరి సీఐని కోరినట్లు ఆయన పేర్కొన్నారు. పరామర్శించిన వారిలో ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షులు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉద్యోగాలకు నేడు ఇంటర్వ్యూలు

తిరుపతి అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సీసీఎల్ ప్రొడక్ట్స్ ఇండియా లిమిటెడ్‌లో ఉద్యోగాల కోసం శ్రీకాళహస్తిలోని ఎస్పీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఇంటర్వ్యూలు ఉంటాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. ఐటీఐ, డిప్లొమా, బీఎస్సీ కెమిస్ట్రీలో ఉత్తీర్ణత సాధించిన యువతీయువకులు అర్హులని పేర్కొన్నారు. 18–25 ఏళ్ల వయస్సు ఉండాలని చెప్పారు. ఆ మేరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఇంటర్వ్యూల సమయంలోనైనా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని తెలిపారు. అదనపు సమాచారం కోసం 8919889609, 7989509540 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

14న 'గ్రీన్ వే లైఫ్'పై పోస్టర్ పెయింటింగ్ పోటీలు


తిరుపతి(అలిపిరి): తిరుపతిలోని ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో రీజనల్ సైన్స్ సెంటర్, వే ఫౌండేషన్ సంయుక్తంగా 'గ్రీన్ వే లైఫ్' కార్యక్రమంపై ఈనెల 14న ఆదివారం ఉదయం 10.30 గంటలకు 1 నుంచి పదో తరగతి విద్యార్థులకు పోస్టర్ పెయింటింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ తెలిపారు. ఒక సంవత్సరం కాలంలో లక్ష మొక్కల పెంపకం చేపట్టాలన్న లక్ష్యంతో పోటీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. 'ఒక మొక్కను నాటండి.. అదే ప్రాణాలను కాపాడుతుంది' అనే అంశంపై పోటీలు ఉంటాయన్నారు. పోటీకి సంబంధించిన పోస్టరు కేంద్రం నుంచి అందజేస్తామని.. పాల్గొనేవారు అన్ని పెయింటింగ్ వస్తువులు వెంట తెచ్చుకోవాలని తెలిపారు. 1–4 తరగతులు, 5– 7 తరగతులు, 8–10 తరగతులకు వేర్వేరు విభాగాల్లో పోటీలు ఉంటాయని.. విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు.

జిల్లాలో 658.6 మి.మీ వర్షం

తిరుపతి అర్బన్: జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు 658.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో సరాసరిగా 19.4 మిల్లీ మీటర్ల వర్షం నమోదైంది. మండలాల వారీగా చూస్తే అత్యధికంగా సూళ్లూరుపేటలో 60.2 మి.మీ, అత్యల్పంగా రామచంద్రాపురంలో 0.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ

తిరుపతి అర్బన్: ఘాట్ రోడ్డులో భక్తులను తీసుకుపోవడం.. తిరిగి క్షేమంగా తీసుకురావడమంటే సాక్ష్యాత్తు శ్రీవారికి సేవ చేస్తున్నట్లుగానే భావించాలని డీపీటీఓ చెంగల్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన అధికారులతో తమ చాంబర్ నుంచి మాట్లాడుతూ ఘాట్ రోడ్డులో డ్యూటీలు చేయడానికి అదనంగా డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇప్పటికే 150 మందికి పైగా ఘాట్ రోడ్డు డ్యూటీలు నిర్వహిస్తున్నప్పటికీ మరో 50 మందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. ప్రధానంగా యువ డ్రైవర్లు ఘాట్‌రోడ్డు డ్యూటీలు చేయడానికి ఆసక్తి చూపాలని సూచించారు. మరోవైపు ఆధ్యాత్మిక ప్రాంతమైన తిరుమలతో పాటు జిల్లాలోని పలు పుణ్యక్షేత్రాలకు వచ్చిపోయే భక్తులతో ఆర్టీసీ సిబ్బంది మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. అలాగే ప్రతి డ్రైవర్ ప్రయాణం చేయడానికి ముందు బస్సు కండీషన్ నిశితంగా చెక్ చేసుకోవాలని చెప్పారు.



'నా ఆడ బిడ్డల కోసం నేను హామీ ఇస్తున్నా. తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తా. ఎంత మంది పిల్లలుంటే అంతమందికి ఏడాదికి రూ.15,000 ఇచ్చే కార్యక్రమాన్ని నేను తీసుకుంటా. ఒకప్పుడు ఒకరితో.. ఇద్దరితో సరిపెట్టుకోమన్నా. కానీ ఇప్పుడుచెబుతున్నా మీకు ఓపికుంటే ముగ్గురునలుగురు పిల్లలు కన్నా పర్వాలేదు. ఎందుకంటే జనాభా తగ్గిపోతా ఉంది. రాబోయే రోజుల్లో పిల్లలే మన ఆస్తి. ఆ పిల్లలను బాగా చదివిస్తే ప్రపంచాన్ని శాసించే శక్తి ఆ పిల్లలకు వస్తుంది. అందుకే తల్లికి వందనం అనే పథకాన్ని తీసుకొస్తున్నా..' అంటూ చిత్తూరు జిల్లా, పూతలపట్టులో జరిగిన ఎన్నికల బహిరంగ సభలో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు.



కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక హామీలను తుంగలో తొక్కేరీతిలో కుయుక్తులు పన్నుతున్నారు. పిల్లలందరికీ కాదు.. కుటుంబంలో ఒక్కరికి మాత్రమే తల్లికి వందనమంటూ కొత్త రాగం అందుకున్నారు. దీనిపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

తల్లికి చెబుదాం.. ఒక్కరికే వందనం!

ప్రాథమిక పాఠశాలలు	ప్రాథమికోన్నత పాఠశాలలు
2,090	321
ఉన్నత పాఠశాలలు	**జూనియర్ కళాశాలలు**
524	189
1 నుంచి 10 వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల సంఖ్య	
2,79,377	
ఇంటర్ విద్యార్థులు	**మొత్తం విద్యార్థులు**
60 వేలు	3,39,377

తల్లికి వందనం కింద ఒక్కొక్క విద్యార్థికి రూ.15వేల చొప్పున ఏడాదికి రూ.509,00,55,000 చెల్లించాల్సి ఉంది.

- ఆ ఒక్కరికీ ఇప్పడే కాదు.. ఇంకా టైం ఉంది
- ఎన్నికల హామీపై కూటమి ప్రభుత్వం యూటర్న్
- పిల్లలతో పనిలేకుండా తల్లికి వందనం అమలుకు యత్నం
- విద్యాసంవత్సరం ప్రారంభమై నెలైనా తల్లికి వందనం నిధులు అందక అవస్థలు
- నిబంధనల పేరుతో మెలిక.. కాలయాపనకు అడుగులు
- మండిపడుతున్న తల్లిదండ్రులు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా ఎగ్గొట్టేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. ఇప్పటికే ఉచిత ఇసుక అని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్న విషయం బయటపడింది. తాజాగా తల్లికి వందనం పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయలేక నిబంధనల పేరుతో లబ్ధిదారులను తొలగించేందుకు స్కెచ్ వేసింది. కుటుంబంలో ఉన్న అందరికీ కాదు.. ఒక్కరికే తల్లికి వందనం ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు కూటమి ప్రభుత్వం ఇచ్చిన జీఓలో తేటతెల్లమవుతోంది.

ఆధార్ తప్పనిసరి

బుధవారం తల్లికి వందనం జీవోను కూటమి ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ పథకాన్ని వర్తింపజేస్తామని స్పష్టం చేయలేదు. దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న కుటుంబానికి రూ.15వేలు తల్లికి వందనం పథకం వర్తిస్తుందని పేర్కొంది. పిల్లలకు ఆధార్‌కార్డు తప్పనిసరి చేసింది. అది లేనిపక్షంలో మరో 10 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి సమర్పించాలని లబ్ధిదారులను గందరగోళంలోకి నెట్టింది. పిల్లను బడిలో చేర్పించే సమయంలో తప్పనిసరిగా ఆధార్, రేషన్ కార్డులో విద్యార్థి పేరు లేకుంటే ఒకటో తరగతిలో అడ్మిషన్ పొందేందుకు వెసులుబాటు ఉండదు. ఇది తెలిసి కూటమి ప్రభుత్వం ఆధార్ కార్డు లేదా ఏవేని పది గుర్తింపు కార్డులు ఉండాలని మెలిక పెట్టింది.

నాడు పకడ్బందీగా అమ్మఒడి అమలు



కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో బడి ఈడు పిల్లలు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం కింద ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు ఇంటర్ వరకు చదివే విద్యార్థుల తల్లి ఖాతాలో నేరుగా ఏడాదికి రూ.15 వేల నగదును జమచేసింది. అలా ఏటా తిరుపతి జిల్లాలో ప్రతి ఏటా 2,20,890 మంది విద్యార్థులకు సుమారు రూ.331.34 కోట్లు జమ చేసింది. ఐదేళ్ల పాటు ఈ పథకం నిర్విఘ్నంగా కొనసాగించింది. అమ్మ ఒడి పథకం కారణంగా చదువుకు దూరమైన ఎంతో మంది పిల్లలు మళ్లీ బడి బాట పట్టారు. డ్రాపౌట్స్ తగ్గి ప్రభుత్వ పాఠశాలల్లో 'సీట్లు ఫుల్' బోర్డులు కూడా వెలిశాయి. అర్హులైన ప్రతి తల్లికీ అమ్మఒడి అందించడంతో బడికి వెళ్లే ప్రతి విద్యార్థి 'జగన్ మామయ్య' అంటూ అప్పటి సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిని ఆప్యాయంగా పిలిచేవారు.

ఆలస్యం చేస్తూ..తల్లులను వంచిస్తూ..

కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు అమ్మఒడి పథకానికి పేరు మార్చి తల్లికి వందనంగా నామకరణం చేశారు. ఓ కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఒక్కొక్కరికీ రూ.15వేలు చొప్పున తల్లి ఖాతాలో జమ చేస్తామని గొప్పలు చెప్పుకున్నారు. వారు ఇచ్చిన హామీ ప్రకారం తిరుపతి జిల్లాలో 3,39,377 మంది విద్యార్థులకు రూ.509,00,55000 చెల్లించాల్సి ఉంది. ఆ మేరకు అధికారులు జాబితా సిద్ధం చేశారు. ప్రస్తుత ఇచ్చిన జీఓ ప్రకారం ఇంత మందికి తల్లికి వందనం నిధులు ఇచ్చే పరిస్థితి లేదని అధికారులు అభిప్రాయపడుతున్నారు. బడులు తెరిచి నెలకుపైగా గడుస్తున్నా ఇంతవరకు తల్లికి వందనం నిధులు విడుదల చేయక పోవడంతో తల్లిదండ్రులు కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్నారు. అంతేగాక తల్లికి వందనం పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేయడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కుట్ర కోణం కుండ బద్దలు.. ఒక్కరికే తల్లికి వందనం!



తల్లికి వందనం పథకం విధివిధానాల ప్రకారం ఒక్కో తల్లికి రూ.15 వేలు ఆర్థిక సాయం అంటూ కూటమి పెద్దలు మెలిక పెట్టారు. జీఓ నం.29 ప్రకారం ఒక ఇంట్లో ఆధార్ కార్డు ఆధారంగా (ఆధార్ లేకుంటే దరఖాస్తు చేసుకోవాలని, అది వచ్చేలోపు పది రకాల కార్డుల్ని అనుమతిస్తామని చెప్పారు) తల్లులకు తల్లికి వందనం వర్తింప జేయనున్నట్లు ప్రకటించారు. అంటే ఒక ఇంటికి రూ.15వేలు.. ఈ లెక్కన ఇంట్లో ఒక్కరికే వర్తింపజేయడమన్న మాట. అలాగే విద్యార్థికి 75 శాతం హాజరు తప్పనిసరి. ఈ తతంగం అంతా పూర్తి కావాలంటే కొంత సమయం పడుతుంది. అప్పటి వరకు తల్లికి వందనం అమలయ్యే పరిస్థితి లేదు. తల్లికి వందనం పథకం కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు ప్రభుత్వ మార్గదర్శకాలను చూసి అవాక్కవుతున్నారు.

మాట నిలబెట్టుకోవాలి



ఎన్నికల వాగ్దానాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి. అమ్మఒడి స్థానంలో తీసుకొచ్చిన తల్లికి వందనం పథకంలో పారదర్శకత పాటించాలి. ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం వర్తింపజేస్తామని మాట ఇచ్చారు. ఒక్కొక్కరికీ రూ.15వేలు వంతున ఇస్తామన్నారు. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారు కోట హైస్కూల్‌లో చదువుతున్నారు. వారిద్దరికీ తల్లికి వందనం వచ్చేలా చూడాలి. దానికోసం ఆశగా ఎదురు చూస్తున్నాం.

–రజిని, తిన్నెలపూడి, కోట మండలం, తిరుపతి జిల్లా

తల్లికి వందనం వెంటనే అమలు చేయాలి



తల్లికి వందనం పథకాన్ని వెంటనే అమలు చేయాలి. నేను, నా భర్త కూలి పనులకు వెళ్తాం. మా ఇద్దరి పిల్లలను కోట జెడ్పీ హైస్కూల్‌లో చదివిస్తున్నాం. తల్లికి వందనం పథకం ద్వారా ఇద్దరి పిల్లలకు రూ.30వేలు అందుతుందని చెప్పారు. పాఠశాలలు పునఃప్రారంభమై నెలరోజులు కావస్తున్నా దీనిపై ఇంతవరకు ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. చంద్రబాబునాయుడు తల్లులకు ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలి. పిల్లలందరికీ తల్లికి వందనం నిధులు అందించాలని కోరుతున్నా.

–అపర్ణ, కోట, తిరుపతి జిల్లా

ఒక్కరికే అనడం సరికాదు



రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ ఒక్కొక్కరికీ రూ.15,000 చొప్పున ఇస్తామన్నారు. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమార్తె జాహ్నవి 7వ తరగతి, కుమారుడు లోహిత్ 6వ తరగతి పీ.కొత్తకోట జెడ్పీ హైస్కూల్లో చదువుతున్నారు. ఇద్దరికీ కలిపి రూ.30,000 వస్తుందని ఎదురు చూస్తున్నాం. ఇప్పుడు ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం ఒక్కరికేనని చెప్పడం బాగోలేదు. ఎన్నికల ముందు ఒక మాట అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాట చెప్పడం సరికాదు.

– అశ్విని, చెన్నుగారిపల్లి గ్రామం, పాకాల

బడికి వెళ్లే అందరికీ ఇస్తామన్నారు



ఎన్నికల సమయంలో అమ్మఒడి పథకాన్ని పేరు మార్చి తల్లికి వందనం అని పెట్టారు. కుటుంబంలో ఎంత మంది బడికి వెళ్లుతున్నా అందరికీ పథకం వర్తింపజేస్తామని చెప్పారు. ఆ విధంగానే కచ్చితంగా అమలు చేయాలి. మాకు ఇద్దరు పిల్లలు. నగరంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో ఒకరు 8వ తరగతి, మరొకరు ఇంటర్ సెకెండియర్ చదువుతున్నారు. తల్లికి వందనం కోసం ఎదురు చూస్తున్నాం. చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకుని ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతున్నా అందరికీ ఇవ్వాలి.

– శివకుమారి, అక్కారంపల్లి, తిరుపతి

ఫీజుల కోసం ఒత్తిడి చేస్తున్నారు



జూన్ 12 నుంచి పాఠశాలలు ప్రారంభమయ్యాయి. మాకు ఇద్దరు అమ్మాయిలు. ఓ ప్రైవేటు స్కూల్‌లో ఒకరు 9వ తరగతి చదువుతున్నారు. మరొకరు ఇంటర్మీడియెట్ ఫస్టియర్‌లో చేర్పించాం. స్కూల్ యాజమాన్యాలు ఫీజుల కోసం ఒత్తిడి చేస్తున్నారు. ఇంట్లో పరిస్థితి అంతంతమాత్రమే. రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితి. తల్లికి వందనం పథకం ఒక్కరికే ఇస్తామంటూ పేపర్లలో వార్తలు వస్తున్నాయి. ఎన్నికల సమయంలో చంద్రబాబు పలు మార్లు చెప్పారు. ఇంట్లో ఎంతమంది చదువుకుంటూ ఉంటే అందరికీ ఇస్తామన్నారు. మాట నిలబెట్టుకోవాలి.

– నారాయణమ్మ, జీవకోన, తిరుపతి

స్కూళ్లు ప్రారంభంలోనే అమ్మఒడి వచ్చేది



నాకు ఇద్దరు పిల్లలు. వాకాడులోని ప్రయివేట్ పాఠశాలలో 4, 5 తరగతులు చదువుతున్నారు. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి పథకం కింద డబ్బు స్కూళ్లు ప్రారంభంలోనే నా ఖాతాలో పడ్డాయి. ఇప్పుడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చింది. చంద్రబాబునాయుడు చదువుకునే ప్రతి ఒక్కరికీ తల్లికి వందనం ఇస్తామని చెప్పారు. బడులు ప్రారంభమై నెల రోజులు అయినా ఆ ఊసే లేదు. పాఠశాలల యాజమాన్యం పదే పదే ఫీజులు అడుగుతున్నారు. ఫీజులు కట్టలేక.. తల్లికి వందనం నిధుల కోసం ఎదురు చూస్తున్నాం.

– ఇన్నమాల మస్తానమ్మ, వాకాడు

ఇచ్చిన మాట తప్పొద్దు సారూ



ఇంట్లో ఎంత మంది చదువుకుంటే అంతమందికి తల్లికి వందనం కింద రూ.15 వేల చొప్పున ఇస్తామని చంద్రబాబు చెప్పారు. ఎన్నికల సమయంలో ఆయన మాటలు నమ్మి ఓట్లేశాం. ఇప్పుడు బడులు తెరిచి నెలవుతున్నా తల్లికి వందనం నిధులు రాలేదు. ఈ సారి తల్లికి వందనం డబ్బులు వస్తాయో రావో అనే అనుమానంగా ఉంది. ఎంతో భవిష్యత్తు ఉన్న పిల్లల చదువుల విషయంలో చంద్రబాబు ఇచ్చిన మాట తప్పకుండా ఆదుకోవాలి. నాకు ఇద్దరు పిల్లలు. చెప్పిన మాట ప్రకారం ఇద్దరికీ తల్లికి వందనం కింద నగదు జమ వేయాలి.

– కావలి భవాని, గొల్లపాళెం

ముగ్గురు పిల్లలకు ఇవ్వాల్సిందే



నా కు ముగ్గురు పిల్లలు. వరదయ్యపాళెంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ వాగ్దానాలు విన్నాం. మాకున్న ముగ్గురు పిల్లలకు ఒక్కొక్కరికీ రూ.15వేల చొప్పున ఏడాదికి రూ.45వేలు వస్తుందని ఆశపడ్డాం. అయితే పాఠశాలలు ప్రారంభమై నెల కావస్తోంది. అయినా ఇప్పటివరకు తల్లికి వందనం అందలేదు. పుస్తకాలు, యూనిఫాం దుస్తులు, ఇతర విద్యాసామగ్రి కొనుగోలు భారంగా మారింది. తల్లికి వందనం నగదు వచ్చి ఉంటే భారం తెలిసేది కాదు.

–పద్మ, వరదయ్యపాళెం మండలం

నాయకులకే ఇసుక.. సామాన్యులకు మస్కా



ఇసుక స్టాక్ పాయింట్ నిర్వాహకులతో వాగ్వాదానికి దిగిన ట్రాక్టర్ యజమానులు

నాగలాపురం: మండల పరిధిలోని సుబ్బనాయుడుకండ్రిగ ఇసుక స్టాక్ పాయింట్లో గందరగోళం నెలకొంది. టీడీపీ నాయకులు వందల సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్లను స్టాక్ పాయింట్ వద్ద దింపేశారు. అవి నిండిన తర్వాతే సామాన్యులకు ఇసుక విక్రయిస్తున్నారు. అధికారులు కాకుండా ఇక్కడ స్థానిక టీడీపీ నాయకులు తిష్టవేసి అరాచకాలు సృష్టిస్తున్నారు. అరకొర వచ్చే సామాన్యులకు ఇసుక ఇవ్వకుండా తిప్పిపంపుతున్నారు. దీనిపై ట్రాక్టర్ యజమానులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక స్టాక్ పాయింట్‌ను సందర్శించిన జేసీ

సుబ్బనాయుడుకండ్రిగ ఇసుక స్టాక్ పాయింట్‌ను గురువారం జేసీ ధ్యాన్‌చంద్ర సందర్శించారు. అనంతరం ట్రాక్టరు, టిప్పరు యాజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం టన్ను ఇసుకను ఎంత ధరకు ఇస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ అవసరాలకు మొదట ఇసుకను పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ట్రాక్టర్ యజమానులు మాట్లాడుతూ ఒక ట్రాక్టర్ ఇసుక తోలడానికి ఒకరోజు వేచి ఉండాల్సి వస్తోందని వాపోయారు. టిప్పర్లకు ఇసుక నింపడానికే స్థానిక నాయకులు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, నాగలాపురం తహసీల్దార్ డీ.నరసింహులు, ఎంపీడీఓ పీఎంకే.బాబు, డీటీ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ అవసరం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యఅతిథులు

తిరుపతి సిటీ: విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ ఎంతో అవసరమని రాష్ట్రపతి పురస్కార గ్రహీత, సాహిత్యశాస్త్ర నిపుణులు రిటైర్డ్ ప్రొఫెసర్ కే.రామసూర్యనారాయణ పేర్కొన్నారు. గురువారం జాతీయ సంస్కృత వర్సిటీలో కమ్యూనికేషన్ స్కిల్స్ డెవలప్‌మెంట్స్‌పై వివిధ పరిషత్తులను జ్యోతి ప్రజ్వలన చేసిన ఆయన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధునిక పోటీ ప్రపంచాన్ని ఎదుర్కోవాలంటే విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌లో ప్రావీణ్యం సంపాదించుకోవాలని సూచించారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, డీన్లు దక్షిణమూర్తిశర్మ, రజనీకాంత్‌శర్మ, కో–ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

మోగిన జూడాల సమ్మె సైరన్

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో జూనియర్ డాక్టర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం వర్సిటీ పరిపాలనా భవనం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు జూడా అసోసియేషన్ ప్రెసిడెంట్ జూనపూడి ఎజ్రా తెలిపారు. గత పదేళ్ల నుంచి రూ.7 వేలు మాత్రమే స్టైఫండ్ ఇస్తున్నారని, నిత్యావసర ధరలు పెరిగినప్పటికీ స్టైఫండ్‌ను పెంచడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. ఇతర రాష్ట్రాలలో వెటర్నరీ జూడాలకు భారీ ఎత్తున స్టైఫండ్ ఇస్తూ ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. వెంటనే స్టైఫండ్‌ను రూ.15వేలకు పెంచాలని, లేనిపక్షంలో శుక్రవారం నుంచి విధులు బహిష్కరించి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 73,353 మంది స్వామివారిని దర్శించుకోగా 28,444 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.05 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

గూడూరు రూరల్: మహిళతో సహజీవనం చేస్తున్న ఓ వ్యక్తి ఆమె నివసించే ఇంట్లోనే ఉరి వేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. కోట దళితవాడకు చెందిన నవకోటి సందీప్(31) బ్యాండు మేళం వాయిస్తూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. ఈ క్రమంలో గూడూరు టిడ్కో ఇళ్లలో నివసించే ఓ మహిళ అతను పనిచేసే బ్యాండు మేళాం ట్రూప్‌లో పనిచేస్తూ సందీప్‌కు దగ్గరైంది. ఆమె భర్తతో విడిపోయి ఇంటి వద్ద ఒంటరిగా జీవిస్తోంది. ఈ క్రమంలో సందీప్‌తో కొంతకాలంగా సహజీవనం చేస్తోంది. అతను బుధవారం కీర్తి ఉండే ఇంటి వద్దకు వెళ్లగా అక్కడ ఏమి జరిగిందో తెలియదు కానీ ఆమె ఇంట్లో నుంచి బయటకు వెళ్లి పోయింది. ఆ తర్వాత సందీప్ ఇంట్లో గడియ పెట్టుకుని ఫ్యాన్‌కు ఉరివేసుకోని తనువు చాలించాడు. పోలీసులకు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదులో బుధవారం సాయంత్రం కూడా తమతో ఫోన్లో బాగా మాట్లాడాడని, ఆయన మృతిపై అనుమానాలు ఉన్నాయని చెప్పడంతో పోలీసులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.

పూణేలో రేపు జాతీయ సదస్సు



వజ్రాల చంద్రశేఖర్

తిరుపతి లీగల్ : న్యాయవాద పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 13 ,14 తేదీల్లో మహారాష్ట్ర, పూణేలో భారతీయ న్యాయ శాస్త్రం (కొత్త క్రిమినల్ చట్టాలు)పై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు రాష్ట్ర న్యాయవాద పరిషత్ కార్యదర్శి, జాతీయ కౌన్సిల్ సభ్యుడు వజ్రాల చంద్రశేఖర్ తెలిపారు. పూణేలోని ఎంఐటీ యూనివర్సిటీ ఆవరణలోని బందార్కర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈ వర్క్‌షాప్ ఉంటుందన్నారు. ఈ వర్క్‌షాప్‌లో చట్టాలపై అవగాహన కల్పించడానికి దేశంలోని పలువురు న్యాయనిపుణులు హాజరుకానున్నట్టు వెల్లడించారు. న్యాయవాద పరిషత్ రాష్ట్ర, తిరుపతి శాఖ సభ్యులైన పలువురు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

తిరుపతి నుంచి యూఏఈకి సిద్ధం

- ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ నడిపేందుకు ఆసక్తి
- ఎయిర్‌పోర్టు అడ్వయిజరీ కమిటీలో తిరుపతి ఎంపీ గురుమూర్తి



మాట్లాడుతున్న కమిటీ చైర్మన్, ఎంపీ మద్దిల గురుమూర్తి

చంద్రగిరి(తిరుచానూరు): ఎయిర్ ఇండియ ఎక్స్‌ప్రెస్ సంస్థ తిరుపతి నుంచి యూఏఈకి విమాన సర్వీసులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నాయని, అందుకు కావాల్సిన వయబిలిటీ గ్యాప్ ఫండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తే విదేశాలకు రాకపోకలు సుగమం అవుతాయని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి తెలిపారు. గురువారం తిరుపతి తాజ్ హోటల్‌లో ఎయిర్‌పోర్ట్ అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎయిర్‌పోర్టు అడ్వయిజరీ కమిటీ చైర్మన్ హోదాలో తిరుపతి ఎంపీ, కో చైర్మన్ హోదాలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి నుంచి విమానాశ్రయం వరకు రైల్వే ట్రాక్ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్యం లోపించిన కారణంగా ఆ వ్యర్థాల కోసం వచ్చే పక్షులు విమానాలకు ఢీకొని ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. ఇప్పటి వరకు సుమారు 16 సంఘటనలు జరిగాయాని, అందువల్ల పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. అనంతరం సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. తిరుపతి విమానాశ్రయంలో ఉన్న టీటీడీ శ్రీవాణి టికెట్ కౌంటర్‌లోనే శ్రీవారి బ్రేక్ దర్శనం, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు అందుబాటులో ఉంచినట్లయితే తిరుపతి విమానాశ్రయం ద్వారా తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. శ్రీవారి దర్శనానికి ప్రయాణికులు విమానాశ్రయం ద్వారా ప్రయాణించేందుకు మొగ్గు చూపుతారని, తద్వారా విమానాల సంఖ్య పెరిగి విమానాశ్రయ అభివృద్ధికి ఉపయుక్తంగా ఉంటుందని అడ్వయిజరీ కమిటీ సభ్యులందరూ ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. అలాగే స్థానిక కళలను ప్రోత్సహిస్తూ విమానాశ్రయంలో శ్రీకాళహస్తి ప్రసిద్ధ కళంకారి, కొయ్య బొమ్మల స్టాల్స్ కోసం స్థలం కేటాయించాలని కోరారు. విమానాశ్రయ టెర్మినల్ వెలుపల సర్వైలెన్స్ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటుగా విమానాశ్రయ పరిసరాలలో పచ్చదనం పెంచే విషయంపై దృష్టి పెట్టాలన్నారు. ప్రధాన నగరాలకు విమాన కనెక్టివిటీ కల్పిస్తూ ఇప్పటికే విమాన కనెక్టివిటీ ఉన్న నగరాలకు విమానల సంఖ్య పెంచాలని, అంతర్జాతీయ విమానాలు నడపాలని సమావేశంలో పాల్గొన్న విమానాశ్రయ అభివృద్ధి సలహా మండలి డైరెక్టర్లు కోరారు.

పారిశుద్ధ్య కార్మికులపై వేధింపులు ఆపాలి



పారిశుద్ధ్య కార్మికులతో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర

తిరుపతి తుడా: రుయా, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో పారిశుధ్య బాధ్యతలు నిర్వహిస్తున్న ఏ వన్ కాంట్రాక్ట్ సంస్థ కార్మికులపై వేధింపులు మానుకోవాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర డిమాండ్ చేశారు. మెటర్నిటీ ఆసుపత్రిలో గురువారం అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులతో అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ఆసుపత్రి పరిశుభ్రత, మలినాలతో సహవాసం చేస్తూ పని చేసే కార్మికులను కాంట్రాక్ట్ సంస్థ వేధించడం బాధాకరమని అన్నారు. ఇక్కడ కనీస వేతనాలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా కార్మికులను వేధిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. గడిచిన మూడేళ్లుగా పీఎఫ్ అమలు కాకుండా కాంట్రాక్టు సంస్థ అడ్డుపడుతోందని మండిపడ్డారు. పారిశుధ్య కార్మికులకు వెంటనే వేతనాలు ఇవ్వాలని, పీఎఫ్‌ను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. అసోసియేషన్ సభ్యులు గుర్రమ్మ, వనజ, ముని రాజమ్మ, నాగజ్యోతి, లక్ష్మీ, హంస, పద్మ, అన్నపూర్ణ, లీల, దీప ,శాంతి పాల్గొన్నారు.

కందిపప్పు కౌంటర్ ప్రారంభం



కందిపప్పు పంపిణీ చేస్తున్న జేసీ

తిరుపతి అర్బన్: తిరుపతి, గూడూరు రైతు బజారుల్లో కేజీ కంది పప్పు రూ.160 చొప్పున పేదలకు ఇవ్వడానికి అధికారులు నిర్ణయించారు. ఆ మేరకు గురువారం తిరుపతి రైతు బజారులో జేసీ ధ్యాన చంద్ర కందిపప్పు పంపిణీని ప్రారంభించారు. అంతేకాకుండా సాధారణ పచ్చి బియ్యం కిలో రూ.48, స్టీమ్డ్ రైస్ రూ.49కి అందించే ప్రక్రియను కూడా ప్రారంభించారు. మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో హోల్‌సేల్ కిరాణా మర్చంట్ అసోసియేషన్ నేతృత్వంలో పైన తెలిపిన ధరలకే ఆ మూడు వస్తువులను విక్రయించనున్నారు. జిల్లాలో మొత్తంగా 16 కౌంటర్లు ఏర్పాటు చేశారు. తిరుపతిలో జేసీతోపాటు సివిల్ సప్లై జిల్లా అధికారి రాజా రఘువీర్ పాల్గొన్నారు.

శ్రీవారి ఆరాధనకు వైఖానస భగవత్ శాస్త్రం మూలం



వేంకటేశ్వర స్వామికి హారతి ఇస్తున్న అర్చకులు

తిరుమల: తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆరాధన విధానానికి మూలం వైఖానస మహర్షి రచించిన వైఖానస భగవత్ శాస్త్రమని తిరుమల వైఖానస ట్రస్ట్ అధ్యక్షులు రాఘవ దీక్షితులు పేర్కొన్నారు. తిరుమల ఆస్థాన మండపంలో వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధిని సభ, టీటీడీ ఆల్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం మరీచి మహర్షి తిరునక్షత్రోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రాఘవ దీక్షితులు మాట్లాడుతూ, వైఖానస భగవత్ శాస్త్రం వేదంతో కూడినదని, దేవాలయ సంస్కృతికి మూలమైన వేదమంత్రాలతో జరిపే వైఖానస ఆరాధన తిరుమల శ్రీవారికి అత్యంత ప్రీతిపాత్రమైనదని చెప్పారు. వేల సంవత్సరాలుగా శ్రీవారికి పూజలు, ఉత్సవాలు వైఖానస ఆగమం ప్రకారం జరుగుతున్నాయని వివరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సనత్ కుమార్ ప్రసంగిస్తూ మరీచి మహర్షి అందించిన శాస్త్ర గ్రంథాలపై పరిశోధనలు జరిపి, అందులోని ఆగమ శాస్త్ర ప్రాధాన్యతను, సమాజహితాన్ని వెలుగులోకి తీసుకురావాలన్నారు. ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఆగమశాస్త్ర ఆచార్యులు భవనారాయణాచార్యులు మాట్లాడుతూ, మరీచి మహర్షి ఉపదేశించిన విషయాలు, కల్ప సూత్రాల ఆధారంగా రూపొందించబడ్డాయని చెప్పారు. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైఖానస భగవత్ శాస్త్రంలో చెప్పబడిందని, ఈ ఉత్సవ నిర్వహణ, సందర్శన వల్ల భక్తులకు అశ్వమేథ యాగం చేసిన ఫలం లభిస్తుందని తెలిపారు. వైఖానస ట్రస్ట్ ట్రస్టీ శ్రవణ్‌కుమార్ ప్రసంగిస్తూ, భారతీయ సంస్కృతికి మూలం వేదాలు, ఆగమ శాస్త్రాలని, సమాజంలోని మానవాళిని ధర్మం మార్గంలో నడిపిస్తున్నాయన్నారు. అనంతరం వైఖానస ట్రస్ట్ కార్యదర్శి ప్రభాకర్ ఆచార్యులు ప్రసంగిస్తూ దేవాలయాల విశిష్టత, అర్చన, పూజ విధానాలను వివరించారు. అంతకుముందు ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం అధ్యాపకులు, విద్యార్థులు స్తోత్ర పఠనంతో మంగళ నిరాజనం సమర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆల్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు అధికారి పురుషోత్తం పాల్గొన్నారు.

రాత్రిపూట గస్తీలు తప్పనిసరి



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుమల : రాత్రుల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది బీట్‌బుక్‌లో ఉన్న అన్ని ప్రాంతాల్లో ప్రనాళిక ప్రకారం కచ్చితంగా తిరగాలని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. గురువారం రాత్రి ఆయన తిరుపతి, చంద్రగిరి సబ్ డివిజన్లలో బీట్ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాత్రిపూట సమర్ధవంతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. తిరుపతి, చంద్రగిరి సబ్ డివిజన్ ల పరిధిలో రాత్రిపూట గస్తీ తిరిగే పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ గారు తనిఖీ చేశారు. రాత్రి గస్తీ తిరుగే సిబ్బందికి తమ బీటు పరిధిలో ఉన్న రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, హిస్టరీ షీటర్లును కచ్చితంగా తనిఖీ చేసి బీట్ పుస్తకంలో నమోదు చేయాలన్నారు. ఎల్‌హెచ్ఎంఎస్ కెమెరాలను బీట్ సిబ్బంది తనిఖీ చేయాలని చెప్పారు. అనంతరం బీటు పుస్తకాలు రాస్తున్న విధానాన్ని తనిఖీ చేశారు. ప్రతి విషయాన్ని సమగ్రంగా బీటు పుస్తకంలో రాయాలని ఆదేశించారు. గతంలో నేరం జరిగినటువంటి ప్రదేశాలను కూడా బీటు పుస్తకంలో నమోదు చేయాలన్నారు. ఆయన వెంట అదనపు ఎస్పీ కులశేఖర్, డీఎస్పీలు రవి మనోహర ఆచారి, నరసింగప్ప, రమణకుమార్, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ దళిత నాయకుడిపై దాడికి యత్నం



విచారిస్తున్న పోలీసులు



శేషాపురం ప్రధాన రహదారిపై గుమికూడిన టీడీపీ నేతలు

- ద్విచక్ర వాహనాన్ని లాక్కుని దాడికి పూనుకున్న టీడీపీ నేతలు
- అడ్డుకున్న శేషాపురం దళితవాడ గ్రామ ప్రజలు

చంద్రగిరి : బంధువుల ఇళ్లలో శుభకార్యానికి హాజరైన వైఎస్సార్‌సీపీ దళిత నాయకుడిపై టీడీపీ నేతలు దాడికి యత్నించిన ఘటన మండల పరిధిలోని శేషాపురం పంచాయతీలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడి వివరాల మేరకు.. శేషాపురం దళిత వాడకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వినోద్ తిరుపతిలో నివాసం ఉంటున్నారు. గురువారం సాయంత్రం శేషాపురం దళితవాడలోని తన బావమరిది ఇంట్లో శుభాకార్యానికి బయలుదేరాడు. విషయం తెలుసుకున్న పక్క గ్రామానికి చెందిన టీడీపీ నేతలు శేషాపురం దళితవాడకు చేరుకున్నారు. ద్విచక్ర వాహనంపై అటుగా వస్తున్న వినోద్‌ను అడ్డగించి బలవంతంగా ద్విచక్ర వాహనాన్ని లాక్కున్నారు. ఎందుకు వాహనాన్ని లాకున్నారంటూ ప్రశ్నించడంతో పరుష పదజాలంతో దూషణలకు దిగి, ఒక్కసారిగా ఆయుధాలతో దాడికి యత్నించారు. అప్రమత్తమైన వినోద్ కేకలు వేయడంతో దళితవాడ వాసులు, టీడీపీ నాయకులను అడ్డుకునేందుకు యతి్నంచారు. ఈ క్రమంలో టీడీపీ నాయకులు గ్రామంలోని పలువురిపై దాడికి పాల్పడ్డారు. గ్రామస్తులందరూ ఏకమవ్వడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ''వాడిని ఈరోజు చంపకుండా వదలం.. మా పార్టీకి వ్యతిరేకంగా ఎన్నికల్లో వాడు పనిచేశాడు'' అంటూ టీడీపీ నేతలు దూషణలకు దిగారు. దీంతో బాధితుడు చంద్రగిరి పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చి, దళిత నేతను క్షేమంగా గమ్యానికి చేర్చారు.

బియ్యం లారీలు సీజ్



దొరవారిసత్రం వద్ద పట్టుబడిన బియ్యం లారీ

సూళ్లూరుపేట/గూడూరు రూరల్: సూళ్లూరుపేట, తడ మండలాలు కేంద్రంగా నెల్లూరులోని పలు రైస్‌మిల్లులకు అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను రెవెన్యూ, పోలీస్ అధికారులు సీజ్ చేశారు. బుధవారం అర్ధరాత్రి తడ మండలం, కొండూరు నుంచి బయలుదేరిన తమిళనాడు రేషన్ బియ్యం లారీని స్థానిక తహసీల్దార్ గోపాలకృష్ణ వెంబడించి దొరవారిసత్రం మండలం, నెలబల్లికి సమీపంలో పట్టుకున్నారు. లారీకి ఉన్న పట్టవిప్పి చూడగా తమిళనాడుకు చెందిన రేషన్ బియ్యం సుమారు 30 టన్నుల దాకా ఉన్నట్టు గుర్తించారు. వాటికి సరైన బిల్లులు, ఆధారాలు లేకపోవడంతో లారీని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అలాగే గురువారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో గూడూరు సమీపంలోని ఆదిశంకరా ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఆంధ్ర రేషన్ బియ్యం లారీని గూడూరు రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ఈ రెండు లారీల ద్వారా బియ్యం అక్రమంగా వ్యాపారాలు చేస్తున్న వారు ఒకరికొకరు పోటీ పడి పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించి మరీ పట్టించారు. ఆంధ్ర రేషన్ బియ్యం సుమారు 35 టన్నుల దాకా ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. కొంతమంది అధికారపార్టీ నేతలు ఈ వ్యాపారాన్ని సిండికేట్ చేసి నెలవారీ మామూళ్లు భారీగా వసూలు చేస్తున్నారు. అలా మామూళ్లకు ఒప్పుకోకపోని వారిపై కక్షగట్టి ఇలా సమాచారం ఇచ్చి పోలీసులు, రెవెన్యూ అధికారులకు పట్టిస్తున్నట్టు తెలుస్తోంది. గురువారం పట్టుబడిన లారీని విడిపించుకునేందుకు వివిధ రకాలుగా రాజకీయ పైరవీలు చేసినప్పటికీ మీడియా జోక్యంతో అందరూ వెనక్కివెళ్లిపోయారు. పోలీసులకు కూడా తప్పనిసరి పరిస్థితుల్లో సీజ్ చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

జనాభాతోపాటు ఆహారోత్పత్తులు పెరగాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: దేశంలో జనాభా పెరుగుదల ఎక్కువగా ఉందని అందుకు తగ్గట్టు ఆహారోత్పత్తుల నిల్వలు పెరగాలని సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ అభిప్రాయపడ్డారు. గురువారం ఎస్వీయూ పాపులేషన్ స్టడీస్, సోషియల్ వర్క్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేసి మాట్లాడుతూ దేశ జనాభాలో యువత అధికంగా ఉండడం శుభపరిణామన్నారు. ఇది అభివృద్ధికి సూచికగా చెప్పవచ్చన్నారు. దీంతో పాటు జనాభా అధికంగా పెరగడం వల్ల అనర్థాలు అంతే స్థాయిలో ఉన్నాయని, ఆకలి చావులు అధికంగా నమోదవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ ప్రిన్సిపల్ జి.పద్మనాభం మాట్లాడుతూ జనాభా పెరుగుదలతో కలిగే నష్టాలు, ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు అతిథులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల సోషియల్ వర్క్ హెడ్ సుజాతమ్మ, ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత మేనేజర్ సుబ్రమణ్యం, సాయి సుజాత, సునీల్ కుమార్, రేనా, కోదండారెడ్డి, శివప్ప, పార్థసారథి, భాగ్యలక్ష్మీ, శ్రీహరి, విద్యార్థులు పాల్గొన్నారు.

వలస కూలీలపైకి దూసుకొచ్చిన మృత్యువు

- కారు ఢీ కొని ముగ్గురు యువకుల దుర్మరణం
- ఆ ముగ్గురూ ఒడిశా రాష్ట్రం వలస కూలీలే



రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు

బుచ్చినాయుడుకండ్రిగ: పొట్టచేతబట్టుకుని వలస వచ్చిన కూలీలపైకి మృత్యువు రూపంలో కారు దూసుకొచ్చింది. ముగ్గురు యువకుల ప్రాణాలను తీసింది. ఈ విషాద ఘటన మండలంలోని శ్రీకాళహస్తి–తడ రహదారి పార్లపల్లి గ్రామ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు. మండలంలోని ఆలత్తూరు గ్రామంలో శ్రీనిధిరాజా పరిశ్రమలో ఒడిశా రాష్ట్రానికి బాపూన్ సింగ్ (22), రాజాసింగ్ (22), సుఖ్‌దేవ్‌సింగ్ (22) కూలీలుగా పనిచేస్తున్నారు. గురువారం వంట సరుకుల కొనుగోలు నిమిత్తం పరిశ్రమలో పనిచేస్తున్న ప్రొడక్షన్ మేనేజరు వినోద్ ద్విచక్ర వాహనాన్ని తీసుకుని శ్రీకాళహస్తికి వెళ్లారు. సరుకులు కొనుగోలు చేసుకుని పరిశ్రమకు వెళ్తుండగా పార్లపల్లి గ్రామ సమీపంలో బుచ్చినాయుడుకండ్రిగ నుంచి శ్రీకాళహస్తికి వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీ కొంది. దీంతో ద్విచక్ర వాహనంలో వెళ్తున్న ముగ్గురు యువకుల తలలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.

టీటీడీ ఆలయాలను ప్రక్షాళన చేయాలి



మాట్లాడుతున్న సాధు పరిషత్ ప్రతినిధి శ్రీనివాసానంద సరస్వతిస్వామి

- లేని పక్షంలో ఆమరణ దీక్షకు సిద్ధం
- సాదు పరిషత్ ప్రతినిధి శ్రీనివాసానంద సరస్వతి స్వామి డిమాండ్

తిరుపతి కల్చరల్: తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో హిందూ మతం నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న వాటిపై చర్యలు తీసుకుని ప్రక్షాళన చేయాలని సాధు పరిషత్ ప్రతినిధి శ్రీనివాసానంద సరస్వతి స్వామి డిమాండ్ చేశారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమలలో మఠాల ముగుసులో జరుగుతున్న దోపిడీని అరికట్టి, మఠాల భవనాలను టీటీడీ స్వాధీనం చేసుకోవాలన్నారు. అలాగే టీటీడీ అనుబంధమైన శ్రీగోవిందరాజస్వామి ఆలయం ప్రధాన గోపురం మార్గం ఆక్రమణలకు గురైందని, గోవిందుని పుష్కరిణి మాదక ద్రవ్యాలకు కేంద్రంగా మారిందని ఆరోపించారు. పుష్కరిణిలో నీరు నింపలేని పరిస్థితిలో ఉండడం బాధాకరమన్నారు. టీటీడీ అనుబంధ ఆలయాల సమస్యలపై టీటీడీ ఈవో శ్యామలరావుకు తెలియజేశామని, ఈవో 15 రోజుల్లో పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. ఆ గడువుకు మించి సమస్యలు పరిష్కరించని పక్షంలో సాధుపరిషత్ ఆధ్వర్యంలో ఆమరణ దీక్షకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సాధు పరిషత్ ప్రతినిధులు అట్టూరి నారాయణ, భైరవనంద, శ్రీనివాసనంద, శుభోదనంద, సాంబశివానంద, గణేష్ స్వామి, ఓంకార్ పాల్గొన్నారు.

ఇంటి స్థలాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి



ఈఓకు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఉద్యోగులకు పాదిరేడు వద్ద కేటాయించిన ఇంటి స్థలాల అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాలని ఈఓ శ్యామలరావుకు ఎంప్లాయిస్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం సమర్పించారు. ప్లాట్ల వద్ద ఇచ్చిన ప్రొసీడింగ్స్ ప్రకారం ప్రభుత్వం నుంచి రావాల్సిన భూమిని సేకరించాలని, తుడా నుంచి అప్రూవల్ ఇప్పించాలని కోరారు. రిజిస్ట్రేషన్లలో జరిగిన పొరపాట్లను రిజిస్ట్రార్‌తో మాట్లాడి ఆ డబ్బులను టీటీడీ చెల్లించాలని విన్నవించారు. సర్వీస్‌లో మిగిలిపోయిన వారికి భూమిని సేకరించి ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఈఓ సంబంధిత ఫైల్ వివరాలు చూసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ హౌసింగ్ సొసైటీ నాయకులు గోల్కొండ వెంకటేశం, గంపల వెంకటరమణారెడ్డి, ప్రసాదరావు, రామచంద్ర, నాగార్జున, ఇందిరా, కల్పన, గుణశేఖర్, వాసు తదితరులు పాల్గొన్నారు.